నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 25 జనవరి 2025 | SIDDIPET

చేర్యాల : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామసభలో పింఛన్ రావడం లేదని అధికారి వద్ద కన్నీరు పెట్టుకుంటున్న వృద్ధురాలు బాలమ్మ



మెదక్ జిల్లా కొల్చారం గ్రామసభలో ఇల్లు రాలేదని తహసీల్దార్‌ను నిలదీస్తున్న మహిళలు

ఆఖరిరోజూ ఆగ్రహావేశాలు

- నాలుగో రోజూ నిరసనలు, నిలదీతలు
- అధికారులకు ప్రజలు ప్రశ్నల వర్షం
- జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండడంపై ఆగ్రహం
- కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలా అంటూ ఆక్రోశం
- ప్రభుత్వ తీరును ఎక్కడికక్కడ ఎండగట్టిన ప్రజలు
- పోలీస్ పహారా మధ్య ముగిసిన గ్రామసభలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజల గుర్రు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రూరల్ మండలం పొట్లపల్లిలో పోలీసు పహారాలో గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో గ్రామసభలో పథకాలపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సిద్దిపేట, జనవరి 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలు అట్టర్ ప్లాప్ అయ్యాయి. ప్రభుత్వానికి మైలేజీ వస్తది అనుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశలు ఆడియాశలు అయ్యాయి. ఏడా ది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. నాలుగు రోజులపాటు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జరిగిన గ్రామసభలతో తేటతెల్లమైంది. గ్రామాల్లో నిరసనలు, నిలదీతలతో నాలుగు రోజుల పాటు పల్లెలు దద్దరిల్లాయి. గ్రామ సభకు హాజరైన అధికారులకు ప్రజల నుంచి ప్రశ్నల వర్షం కురిసింది. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం అధికారులు చెప్పలేక పోయారు.. గ్రామాలకు వెళ్లామా..? జాబితా చదివామా..? మమ అనిపించామా..? అన్నట్లుగా గ్రామ సభలు నిర్వహించారు. జాబితాలు చదవడం మొదలవ్వగానే ప్రజలు తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఏం హామీలు ఇచ్చారు. ఇప్పుడు చేస్తున్నది ఏమిటి అంటూ గ్రామాల్లో ప్రజలు నిలదీశారు. మొత్తంగా నాలుగు రోజుల గ్రామ సభల్లో అటు ప్రభుత్వానికి, ఇటు అధికార యంత్రాంగానికి ప్రజలు ముచ్చెమటలు పట్టించారు.

ఒక్కోచోట ఒక్కోలా..

◆ శుక్రవారం సిద్దిపేట మున్సిపాలిటీతో పాటు సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, నంగునూరు, చిన్నకోడూరు మండలాల్లో జరిగిన గ్రామసభలో ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపడ్డారు. జాబితాలు ఎలా సిద్ధం చేశారు. అర్హులకు ఈ ప్రభుత్వంలో పథకాలు రావా..? అంటూ అధికారులను ప్రజలు ప్రశ్నించారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభలు రసాభసాగా ముగిశాయి.

◆ గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలం ఎర్రవల్లిలో జరిగిన గ్రామ సభలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గ్రామసభలో కాంగ్రెస్ నేత చేత మాట్లాడించారు. ప్రభుత్వ తీరుపై ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేశారు. జగదేవ్‌పూర్ అల్లిరాజ్‌పేటలో గ్రామసభల్లో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అర్హులకు ఈ ప్రభుత్వం ఏం చేయదంటూ తమ అసహనం వ్యక్తం చేశారు.

◆ దుబ్బాక మున్సిపాలిటీలోని 11వ వార్డు లచ్చపేటలో వార్డుకు చెందిన మామిడాల రాజు అనే యువకుడు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తనపేరు రాలేదని సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నానంటూ నిరసన చేపట్టాడు. అక్కడికి పోలీసులు, మున్సిపల్ అధికారులు చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో తన నిరసనను విరమించుకున్నాడు.

◆ మిరుదొడ్డి మండలం కాస్లాబాద్ గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేరు రాలేదని నిరుపేదలు అధికారుల తీరుపై ప్రజలు తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొగుట్ట మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామసభ రసాభసాగా ముగిసింది. ఇందిరమ్మ ఇండ్లపై అధికారులను నిలదీశారు. రాయపోల్ మండలంలోని ఎల్కల్‌లో ప్రజలు తమ నిరసను వ్యక్తం చేశారు.

◆ హుస్నాబాద్ మున్సిపాలిటీలోని 19వ వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు రావడం లేదంటూ గ్రామసభలో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్, పొట్లపల్లి గ్రామాల్లో అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ మండలాల్లో జరిగిన గ్రామ సభల్లో ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట గ్రామ సభలో ప్రజలు తమ నిరసనను తెలియజేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

◆ మునిపల్లి మండలంలోని పెద్దగోపులారంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆర్డీవోను ప్రజలు ప్రశ్నించారు. పథకాలకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని నిలదీశారు. రాయికోడ్ మండలంలోని సింగీతం, ఇసునూరు, సీరూర్ గ్రామాల్లో రుణమాఫీ కాలేదని, అర్హులకు పథకాలు ఇవ్వలేదని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. హత్నూర మండంలోని దౌల్తాబాద్, శేర్‌ఖాన్‌పల్లి, కొన్యాల గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులకు అందడం లేదని ప్రజలు అధికారులను నిలదీశారు.

◆ నారాయణఖేడ్, సిర్గాపూర్ మండలాల్లో కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని గ్రామసభల్లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కల్హేర్ మండలంలో రైతుభరోసా, రుణమాఫీ కోసం రైతులు అధికారులను ప్రశ్నించారు. ఝరాసంగం మండంలోని వనంపల్లి, బిడకన్నె గ్రామాల్లో రుణమాఫీ చేయలేదని రైతులు అధికారులను నిలదీశారు.

◆ రామచంద్రాపురం మండంలోని తెల్లాపూర్, నాగుపల్లి గ్రామ సభల్లో ప్రభుత్వ పథకాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు అధికారులను నిలదీశారు. కంది గ్రామసభలో పాల్గొన్న మహమ్మద్ అనే వ్యక్తి తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని సెల్‌టవర్ ఎక్కేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు.

◆ శివ్వంపేట మండలం గుడ్లపల్లికి చెందిన రైతులు రుణమాఫీ కావడం లేదని, ఫించన్ డబ్బులు అకౌంట్‌లో పడితే అకౌంట్‌లో హోల్డ్‌లో పెట్టడంపై దొంతి గ్రామ యూనియన్ బ్యాంకు ఎదుటగ నిరసన వ్యక్తం చేశారు. గ్రామసభలో సైతం అధికారులను నిలదీశారు.

◆ కొల్చారంలో జరిగిన గ్రామసభలో ప్రజలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి రచ్చరచ్చ చేశారు. అనర్హులకే ఇండ్లు కేటాయించారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చివరి రోజూ నిరసనలు, నిలదీతలు, ప్రశ్నలతో గ్రామసభలు ముగిశాయి. అధికారులకు చుక్కలు కనపడ్డాయి.

సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో పథకాలపై అధికారులతో గొడవపడుతున్న గ్రామస్తులు

హుస్నాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, జనవరి 24: హుస్నాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని గాంధీచౌక్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ హుస్నాబాద్' ఎంబ్లమ్‌తోపాటు ఫౌంటేన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా, పర్యాటకంగా, విద్య, వైద్య రంగాల్లో ముందుంచేందుకు పాటుపడుతానని చెప్పారు. వచ్చే ఏడాదిలోపు పట్టణానికి రింగ్‌రోడ్డు నిర్మాణం జరిగేలా కృషి చేస్తానని, ప్రజల సహకారంతో హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం, చౌటపల్లి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే

అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్, జనవరి 24: ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం గ్రామసభలో ప్రసంగిస్తుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుపడిన సంఘటన నర్సాపూర్ మండలంలోని పెద్దచింతకుంటలో చోటుచేసుకుంది. పెద్దచింతకుంటలో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ మాయమాటలను, మోసపూరిత వాగ్దానాలను ఆమె ఎండగట్టారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కొంతమంది ఎమ్మెల్యే ప్రసంగించకుండా అడ్డుపడ్డారు. గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో ఎస్సై లింగం, పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా పాలనను సాగించారని వెల్లడించారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాల్లో కోతలు విధిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా పెద్దచింతకుంటలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రసంగాన్ని అడ్డుకొని వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

రుణమాఫీ కాలేదని రైతుల నిరసన

దొంతిలో యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను నిలదీసిన రైతులు, పింఛన్‌దారులు

క్రాప్‌లోన్ కాలే...

నాకు బ్యాంకులో రూ. లక్ష వరకు లోన్ ఉంది. పంట రుణమాఫీ ఐతదనుకున్న. కానీ, కాలేదు. అధికారులను అడిగితే రెండో లిస్టు, మూడో లిస్టు అన్నరు. నాకు రుణమాఫీ కాలేదు. అకౌంట్ కూడా లాక్ చేసి మూడు నెలల పింఛన్లు ఆపిర్రు. నా గతెట్ల కావాలే. అధికారులే న్యాయం చేయాలి.

– సూరారం సత్తయ్య, రైతు, గుండ్లపల్లి

పేరు వచ్చినా పైసల్ పడలే..

నేను యూనియన్ బ్యాంకులో 60వేల లోన్ తీసుకున్న. ఫస్ట్ లిస్టులో రావాల్సిన నా పేరు నాలుగో లిస్టులో వచ్చింది. లిస్టులో పేరు వచ్చినా పైసల్ మాత్రం అకౌంట్‌లో పడలేవు. బ్యాంకు ఆఫీసర్లను అడిగితే గవర్నమెంట్ వేసే వరకు ఆగాలని చెప్పున్నారు. నాకు రుణమాఫీ అయినట్టా... ? కానట్టా...? అర్థం కావడం లేదు.

– ఎరుకలి బాలయ్య, రైతు, గుండ్లపల్లి



మెదక్ జిల్లా దొంతిలో యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న రైతులు

శివ్వంపేట, జనవరి 24: కాంగ్రెస్ ప్రభుత్వం తమకెందుకు రుణమాఫీ చేయలేదని మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతిలోని యూనియన్ బ్యాంకు ఎదుట శుక్రవారం రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నిరసన తెలిపారు. గుండ్లపల్లికి చెందిన రైతులు ఉదయం యూనియన్ బ్యాంకుకు చేరుకొని తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతులతో ప్రభుత్వం ఆడుకుంటున్నదని మండిపడ్డారు. అధికారులను సంప్రదిస్తే అక్కడ వెళ్లండి... ఇక్కడ వెళ్లండి అని తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ లబ్ధిదారుల ఖాతాలు హోల్డ్‌లో పెట్టడంతో పింఛన్ తీసుకోలేక పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 26 తర్వాత వేస్తామన్న రైతుభరోసా డబ్బులు తాము ఎలా తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. పథకాల పేరిట ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, బోళ్ల సదానందం, ఉప్పునూతల వెంకటేశ్‌గౌడ్, ఉప్పునూతల సత్యాగౌడ్, బోళ్ల సత్తయ్య, వంచె సత్యనారాయణరెడ్డి, ఎలకంటి వినోద్, పెంజర్ల నర్సింహులు, మచుకురి రవి, బాలయ్య, బజారి శ్రీనివాస్‌రెడ్డి, బజారి మల్లారెడ్డి, ఇట్టబోయిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ దగా

సిద్దిపేట, జనవరి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో దగా పాలన కొనసాగిస్తున్నదని సిద్దిపేట బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, కాముని శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోయిజ్, కౌన్సిలర్ సాయన్నగారి సుందర్, సాయిశ్వర్ గౌడ్, సయ్యద్‌తో కలిసి వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు 6 గ్యారెంటీలు అని ప్రజలకు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు నాలుగు పథకాలకు లబ్ధిదారులు, అర్హులు, అనర్హులు, దరఖాస్తులు అంటూ దొంగ నాటకాలు ఆడుతున్నదని విమర్శించారు. ప్రజాపాలన గ్రామసభల్లో అసలు అధికారులు చదువుతున్న లిస్టు లబ్ధిదారులదా, అర్హులదా, దరఖాస్తుదారులదా అనేది అర్థం కాని స్థితిలో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజాపాలన అని ఒకసారి, సమగ్ర కుటుంబ సర్వే అని మరొకసారి, ఇప్పుడు గ్రామసభలు అంటూ దరఖాస్తులు తీసుకుంటున్నది తప్ప ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు.గ్రామసభల్లో ప్రజలు తిరగబడుతుంటే పోలీసులను పహారాగా పెట్టి గ్రామసభలు నిర్వహించిందని దుయ్యబట్టారు.గ్రామసభలకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీల్లో స్థానిక ఎమ్మెల్యేలు,ఎంపీల ఫొటో పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బాబుజానీ, ఆదాబ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

హత్నూర, జనవరి 24: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నూతనంగా ఓటుహక్కు పొందిన యువకులు కేసీఆర్‌పై అభిమానం, బీఆర్ఎస్ పార్టీ విధివిధానాలు నచ్చడంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అన్ని విధాలుగా కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. చేరిన వారిలో శ్రీహరి, లక్ష్మీనారాయణ, అభిలాష్, రామకృష్ణ, అభిషేక్, బాలకృష్ణ, రమేశ్, ప్రశాంత్, ప్రసాద్, సుధాకర్, నితిన్ ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, జుట్టు నర్సింహులు, శివ, నర్సింగరావు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

పెద్దశంకరంపేట, జనవరి 24: మండలంలోని సంగారెడ్డిపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సంగారెడ్డిపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చాకలి ఆశయ్య, 50మంది కార్యకర్తలు చేరారు. కార్యక్రమంలో జంగం శ్రీనివాస్, రమేశ్, శంకర్‌గౌడ్, రవీందర్, మానిక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కొనం అంజయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల వినూత్న నిరసన

హుస్నాబాద్, జనవరి 24: ఆరు గ్యారెంటీలను అమలు చేసేలా సీఎంతోపాటు మంత్రులకు కనువిప్పు కలిగించాలని కోరుతూ శుక్రవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి రావాలని ప్రజలకు అలవికాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. ఏడాది గడిచినా సభలతో కాలాన్ని వెల్లదీస్తున్నదని మండిపడ్డారు. హామీలను నెరవేర్చకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొజ్జ హరీశ్, అయిలేని శంకర్ రెడ్డి, నాయకులు పూదరి రవీందర్, థామస్, భూక్య రాజునాయక్, కందుకూరి సతీశ్, జేరిపోతుల లక్ష్మణ్, వెస్లీనాయక్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అధికారుల చొరవతో సెల్‌టవర్ దిగిన రాజుతో మాట్లాడుతున్న దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేశ్

పేరు రాలేదని సెల్‌టవర్ ఎక్కి నిరసన

దుబ్బాక, జనవరి 24: సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట 11వ వార్డుకు చెందిన మామిడాల రాజు అనే యువకుడి పేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రాకపోవడంతో సెల్‌టవర్ ఎక్కాడు. గతంలో ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పేరు లేకపోవడంతో గ్రామసభలో అధికారులను ప్రశ్నించాడు. తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. శుక్రవారం దుబ్బాకకు వచ్చిన రాజు సెల్‌టవర్ ఎక్కి నిరసనకు దిగాడు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని టవర్‌పై నుంచి గ్రామస్తులకు ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో టవర్ వద్దకు వచ్చిన గ్రామ పెద్దలు, పోలీసులు నచ్చజెప్పినా వినకలేదు. మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ వచ్చి హామీ ఇవ్వడంతో సెల్‌టవర్‌ను దిగాడు. రాజు తన తల్లిదండ్రులకు చెందిన ఇంట్లో భార్య, కుమారుడితో కలిసి ఉంటున్నాడు. మున్సిపల్ అధికారులు వారింటికి వెళ్లి ఇందిరమ్మ ఇంటి కోసం మరోసారి అతడి నుంచి దరఖాస్తు స్వీకరించారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

కంది, జనవరి 24 : ఇల్లు లేని తనకు ఇందిరమ్మ ఇంటికి అర్హుడిగా గుర్తించాలంటూ సెల్‌టవర్ ఎక్కి ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. శుక్రవారం కందిలో జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హుల పేర్లను అధికారులు చదివి వినిపించారు. గ్రామసభ కొనసాగుతుండగానే కందిలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఎండీ మహ్మద్ అనే వ్యక్తి సభా ప్రాంగణంలో ఉన్న సెల్‌టవర్ ఎక్కే ప్రయత్నం చేశాడు. కొద్ది దూరం ఎక్కగానే గమనించిన పోలీసులు, అక్కడే ఉన్న గ్రామస్తులు మహ్మద్‌ను పట్టుకొని కిందకు దింపారు. తనకు ఇల్లు లేదని, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, లేకుంటే టవర్ ఎక్కి దూకి చస్తానంటూ బెదించాడు.

కందిలో సెల్ టవర్ ఎక్కుతున్న మహ్మద్‌ను కిందకు దింపుతున్న పోలీసులు

అంగన్‌వాడీ పైకప్పు పెచ్చులూడి ఆరుగురికి గాయాలు

నారాయణఖేడ్, జనవరి 24: అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు పెచ్చులుడడంతో ఆరుగురు చిన్నారులు గాయపడిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. రోజు మాదిరిగానే పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి రాగా, కేంద్రంలో పిల్లలు ఉన్నచోటే ఒక్కసారిగా పై కప్పు పెచ్చులూడి పడ్డాయి. మొత్తం 27మంది పిల్లలు ఉండగా, ఆరుగురు చిన్నారులు హరిక, అంకిత, అవినాష్, మౌనిక, రిషిక, ప్రణయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వారిని నారాయణఖేడ్ ఏరియా దవాఖానకు తరలించారు. విషయన్ని తెలుసుకున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హుటాహుటిన దవాఖానకు చేరుకుని పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని, గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మిగతా పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయని, తీవ్రంగా గాయపడిన పిల్లలను వైద్యుల పర్యవేక్షణలో ఉంచి డిశ్చార్జ్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఊడిపడిన పెచ్చులు